

# అగుపెయ్యని అంతకుడు

టి.వి.శంకరమ్

(కేయాస్ కథ)

నాకు పాటలు బట్టలేదు, చిందులు అంతకు మునుపే పట్టలేదు. అరివోం అంటూనే అత్య జరిగిపోయింది. ఇంకో అత్య విధిగా జరిగి తీరుతుం దని నాకు తెలుసు. అందు కోసం మహశెర్ధగా చూస్తున్నా. ఒక్క క్లూ కూడా పోనీయటంలా. మధ్య మధ్య భూతద్దం వేసికూడా చూస్తున్నా. ఎందుకో మరి భూతద్దః వేసిచూస్తే బొమ్మ బూజు బూజుగా కనపడింది. అందులో ఏదో సయిం చుంటుంది.

అనుకున్నంత పనీ అయింది. ఆ గెడ్డం మనిషి కత్తియుద్ధం చేస్తూ చేస్తూ హాక్షురు మన్నాడు. అది నా కెట్టా తెలిసిం దని అడగ రేం? ఆయన కొడుకు బాక్కురు మన్నాడు. నేను "హాత్తెరీ!" అని లేచా.

"కూచోండి, గురో!" అని భద్రం నన్ను చొక్కాపట్టి గట్టిగా గుంజాడు,

"అత్య, భద్రం!'' అని గట్టిగా అరిచా.

చుట్టూ ఉన్నవాళ్ళంతా, "అక్! హెట్! ఉప్!" అని పొట్టిపొట్టి కేకలు వేశారు. ఒక రిద్దరు గట్టిగా నవ్వి. "వారె గుళ్ళా!" అని కూడా అన్నారు.

భద్రం నా నోరు గట్టిగా నొక్కాడు. ఇన్ని పుస్తకాలు చదివాగాని ఎక్కడా ఏడిటెక్టివా అసిస్టెంటు చేత నోరు మూయించుకోలా!

మూసిన నోటితోనే, "ఊఉః! ఊః ఉః!" అన్నాను. "క్లూలు!" అందామని హుద్దేశం.. భద్రం నా నోటిమీది నుంచి చెయ్యి తీసేయగా మే మక్కణ్ణించి ఇం కెక్కడికో పోయాం.

తరవాత భద్రాన్ని నానా చివాట్లూ పెట్టా! మించిపోయినాక ఏంచేసి ఏం లాభం? మంచి హాటం బాంబంటి కేసు కాస్తా పాడుచేశాడు. పాపిష్టాడు!

మీ సందేహ మేంటి గురో? అన్నాడు భద్రం.

"ఆ గెడ్డం మనిషిని ఎవరు అత్య జేశారో మనం కనుక్కోవద్దూ? ను వ్వాపక పోతే నేను దగ్గిరిగా పోయి చూసేవాణ్ణి గద!'' అన్నాను.

భద్రం నవ్వటం చూస్తే నాకు పట్టరాని హుక్రోషం వచ్చింది.

"అందులో మిష్టరీ ఏమీలేదు, గురో! రాజు కొడుకే చంపాడు. మరి హీరో విలన్ను చంపడా?"

"ఈరో ఎవరు?"

"రాజు కొడుకే! ముసుగు దొంగకూడా రాజు కొడుకే."

"ఈ ఇద్దరూ ఒకడే నని టానికి నీకు క్లూ లేఁవిటీ?"

"ఆడే చెబుతుండెగా?"

"భద్రం! "అన్నాను జాలిగా." నీకు సయించు హోనామాలుకూడా తెలీదు. వాళ్లు చెప్పిందంతా నమ్మితే నువు డిడెక్నను చేసి నట్టే. ఇందులో పెద్ద మిష్టరీ ఉంది, భద్రం. చూడు నీ యీరోను మొదట చంపొచ్చిన మనిషి చచ్చాడు. రాజును మొదట్టో యేసేసిం దెవరో మనకు తెలవదు. గెడ్డమాయిన ఎందుకు హస్తమానం అయిరాన పడి అటూ యిటూ చూసిందీ నాకు హంతు బట్టనేలేదు.

చివరకు నీ యారో గెడ్డమాయనతో కత్తి యుద్ధం చేశాడుగాని, ఇంతలో ఎవరో గెడ్డమాయిన్ని పొడిచి అత్య చేసేశారు. అక్కడే ఉంది మిష్టరీ. యారో ఆయిన్ని పొడవగా చూసిన నా కొడు కెవడూలేడు."

"అట్టా పొడవటం సూపియరాదుగురో!"

"అది నిజమే. అదిచూస్తే ఇంక మిష్టరీ ఏముందీ ?"

"ఈ సారి యీ కేసు నా కొదలండి. ఆ గెడ్డమాయిన్ని పొడిచింది ఈరోయే. రాజును చంపిందేమో గెడ్డమాయిన."

"ఛీ ! ఛీ ! నీ కసలు కేసు హంతుపట్టే లేదు. రాజును చంపినవాడు తెలవకనే గెడ్డమాయిన అంత సేపూ దిక్కులు జూసి అయిరాన పడ్డాడు. నీ యారో ఉన్నాడే, వాడిక్కూడా మిష్టరీ తెలవలా. ఒక్క విదవరాలికి నిజం తెలుసు. యారో కొంత సేపు గెడ్డమాయన్ను అనుమానితుడుగా చూసినమాట నిజమే. అందుకే ఫళ్ళున కత్తిదూసి, 'అణ్ణి పట్రండి !' అని అరిచాడు. అప్పుడు విదవరాలేం చేసిందో నువు గమనించావా ? యారోను మందలించింది. చాతనయితే నా మొగుణ్ణి చంపినవాణ్ణి చంపుగాని, ఈ గెడ్డమాయిన్ని చంపుతావా, అన్నది. దాంతో యారో తాను పెడదార్న పోతున్నట్టు తెలిసి ప్లేటు మార్చేశాడు. అందుకేగా ఆ కొండల్లో ఇద్దరూ అంత సేపు కత్తియుద్ధం చేసుకున్నా ఆకరుకు గెడ్డమాయిన దొరికిపోతే చాంతాడుతో కట్టి అక్కడే పారేసి అమ్మాయి ఒళ్ళో తలపెట్టుకు పడుకున్నాడూ ?"

"అది సస్పెన్స్, గురో !" అన్నాడు భద్రం నవ్వుతూ.

"అంటే ?" అన్నాను హనుమానంతో.

"అక్కడే విలన్ను యారో క్రైమా యేశాడనుకొండి. ఆ తరవాత కథేముంది?"

"ఇదొకటా ?"

ఆలోచించాను. "నీకు అంతకు దెవరో ఎక్కడ తెలిసి పోయింది, భద్రం ?"

"మొదటిరీళ్లోనే తెలిసెగా ?"



"అమ్మాయిలంతా నన్ను నవ్వుతూ చూస్తుంటారు, ఎందుకో ?"
"నువ్వు అపర శ్రీకృష్ణపరమాత్మవు కదూ — అందుకే."

"చా చ! అదేం మిష్టరీ ? నువు మొదటే హగాదంలో పడ్డావు. అందుకే నీకు అంత కుడి జాడ తెలవలా !"

"మరి మీకు తెలవలేదుగా, గురో ?"

"తెలుసుకోకుండా వదుల్తా నను కున్నావా ? భద్రం, ఈ కేయాస్ తగాకాయేం టనుకున్నావ్ ?"

"గెడ్డమాయన్ని చంపింది యారో కాదంటారు, అంతేనా, గురో ?"

"యారో అయితే ఎప్పుడు పొడిచినా పొడవచ్చు, భద్రం. విదవరాలు కావచ్చు, ఏడుపుగొట్టువాడు కావచ్చు. మీసాలు పెట్టుకున్న ఆడకూతురు కావచ్చు. ఇంకెవరన్నా కావచ్చు. నీ యారోమాత్ర కాదు."

"అయితే ఒకపని చేద్దాం. ఇవాళ మళ్ళీ వెళ్ళి చూద్దాం. ఈసారయినా మీరు అసలు మనిషిని పట్టుకోవచ్చు."

"ఈసారి ఇంకో పక్కనించి చూద్దాం, మనం కూచున్నచోటికి యారోకత్తి ఎక్కడ పొడుచుకున్నదీ కనపళ్లా," అన్నాను.

"ఎక్కడ కూచున్నా ఒకటిగానే కనబడుతుంది, గురో !"

"భద్రం, ఇంత మంది అసిస్టెంట్లను చూశాగాని, నీ వంటి మట్టిబుర్ర ఎక్కడా చూళ్ళా !"

"మీ యిష్టం, గురో !"

అన్నానేగాని, ఇంకో చోటనుంచి చూసినా యారో పొడవటం దగ్గిరకొచ్చేప్పటికి గెడ్డమాయిన ఎక్కడున్నదీ తెలవలా. దాన్నిపట్టే అత్యలో మిష్టరీ ఉన్న దని గట్టిగా తేలిపోయింది.

ఇంటి కొస్తుండగా, "హ త్తెరీ !" అన్నా.

"ఏంటి, గురూ ?" అన్నాడు భద్రం,

"క్లూ దొరకింది, భద్రం !"

"ఏంటది, గురో ?"

"ఏవో అక్షరాలు కనిపించినయ్యే, వాటిని చదివావా, భద్రం ?"

"కొన్ని కూడబలుక్కున్నాను, గురో!"

"అంతకుడిపేరు ఆ అక్షరాల్లో ఎక్కడో ఉంటుంది, భద్రం," అన్నాను హాశ్చర్య పరవశంగా...

★